క్లుప్తంగా

విద్యార్థులకు పోటీలు

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లితండా ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో శివకుమార్, జ్యోతేష్ గ్రూప్‌లు ప్రథమ, ద్వితీయ బహుమతులకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బాల రాజు తెలిపారు. విజేతలను పాఠశాల సిబ్బంది అభినందించింది.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

భూత్పూర్: మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ జరీనా చిన్నారులకు బహుమతులను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, లిక్కి నవీన్‌గౌడ్, వసీం సుల్తానా పాల్గొన్నారు.

వ్యాయామంతో బలం

జడ్చర్ల టౌన్: వ్యాయామం ద్వారా ఎముకలు బలంగా మారుతాయని ఏగూర్ ప్రైం ఆస్పత్రి నిర్వాహకులు డా. అంకిత్ అన్నారు. ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన జర్నలిస్టు, కుటుంబ సభ్యుల ఉచిత ఆర్థో, గైనిక్, బీఎండీ పరీక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విధి నిర్వహణలో బిజీగా ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధగా ఉండాలని సూచించారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 75మందికి బీపీ, షుగర్, బోన్ మినరల్ డెన్సిటి పరీక్షలను ఉచితంగా చేశారు.

కుట్టులో నైపుణ్యం సాధించాలి

జడ్చర్ల టౌన్: మహిళలు కుట్టులో నైపుణ్యం సాధించాలని టైలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రయ్య పిలుపునిచ్చారు. టైలర్స్ డేను పురస్కరించుకొని ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సొసైటీ అధ్యక్షురాలు బాలమణి, సభ్యులు కృష్ణవేణి, నీరజ, టైలర్ అసోసియేషన్ సభ్యులు కుద్దూస్, హబీబ్, నాగరాజు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

టిప్పర్ ఢీ: ఇద్దరికి గాయాలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఆర్వోబీ వద్ద స్కూటీని టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. శుక్రవారం కొకుంట్ల మండలం రాజోలికి చెందిన శ్రీకాంత్, లింగేష్ అనే యువకులు స్కూటీపై దేవరకద్ర ఆర్వోబీ వద్ద వెళ్తున్నారు. వారిని టిప్పర్ ఢీకొనగా ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు బోల్తా : తప్పిన ముప్పు

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారిపై మూసాపేట మండలం సంకలమద్ది శివారులో కారు బోల్తాపడిన ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూర్‌కు చెందిన జి.ప్రశాంత్ కుటుంబం కారులో కుంభమేళాకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో శుక్రవారం మధ్యాహ్నం వేముల స్టేజీ దాటిన తర్వాత కారు అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొని కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే పక్క రోడ్డుపైకి దూసుకెళ్లి బోల్తాపడింది. అదృష్టవశాత్తు ఎదురుగా ఎలాంటి వాహనం రాకపోవడంతో పెద్దముప్పు తప్పింది. ఈఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వేణు తెలిపారు.

వెండి ఆభరణాలు వితరణ

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామికి కొకుంట్ల మండలం ముచ్చింతలకి చెందిన భక్తులు సుజాత, మహేందర్‌రెడ్డి దంపతులు 10 తులాల మిశ్రమ వెండి ఆభరణాలను వితరణ చేశారు. శుక్రవారం ఆలయం కార్యాలయంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డికి అందజేశారు.

మట్టి సేకరణ

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయం వద్ద ఎలివేటెడ్ కారిడార్, ఘాట్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం అధికారులు మట్టి సేకరణకు పనులు చేపట్టారు. డ్రిల్లింగ్ మిషన్ల ద్వారా 30 అడుగుల లోతు నుంచి మట్టిని సేకరిస్తున్నారు. ఈ పనులను ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆలయం వద్ద ఘాట్‌రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.110 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. అధికారులు పనులు చేపట్టేందుకు మట్టిని సేకరిస్తున్నారని తెలిపారు.

కొత్త యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇందిర మహిళాశక్తి పథకం కింద కొత్త యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని మెప్మా ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి సూచించారు. శుక్రవారం మెప్మా భవనంలో స్లమ్ లెవల్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ కింద రుణాలు తీసుకున్న మహిళల నుంచి క్రమం తప్పకుండా వాయిదాలు వసూలు చేసి బ్యాంకుల్లో ఎప్పటికప్పుడు జమ చేయాలన్నారు. రుణ బకాయిల రికవరీ కోసం 8–10 మంది ఆర్పీలతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. సీఓలు వరలక్ష్మి, నిర్మల, దేవమ్మతో పాటు ఆఫీస్ బేరర్లు (ఓబీలు) పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతం

- ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు
- 25శాతం రాయితీతో రిజిస్ట్రేషన్లు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు బాధ్యతలు
- జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 97,492



మార్గదర్శకాల వివరాలు తెలియజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ రవీందర్



రిజిస్ట్రేషన్ దస్తావేజును చూయిస్తున్న సబ్ రిజిస్ట్రార్ మొహమ్మద్ హమీద్

మెట్టుగడ్డ: ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) ప్రక్రియ వేగవంతానికి ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిలో భాగంగానే ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోపు ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకునేందుకు దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీ ఇవ్వనుంది. 2020 ఆగస్టు 26 వరకు ఏదైనా వెంచర్ లో పది శాతం ప్లాట్లు అమ్మకాలు జరిగి, మిగిలిపోయిన 90శాతం ప్లాట్లకు కూడా ఎల్‌ఆర్‌ఎస్ వర్తింపజేయనుంది. గతంలో 26 ఆగస్టు 2020 కు ముందు ఎల్‌ఆర్‌ఎస్‌కు అప్లైచేసిన వారికి అప్పటి మార్కెట్ వాల్యూలో 25శాతం తగ్గింపుతో ఎల్‌ఆర్‌ఎస్ అమలుచేస్తున్నారు. కొత్తగా మార్చి 31లోపు దరఖాస్తు చేసుకునే వారికి ఇప్పుడున్న మార్కెట్ వ్యాలులో 25 శాతం తగ్గింపుతో అమలు చేయనున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ మరింత వేగవంతమయ్యేందుకు ఫీజు చెల్లింపులో ఇబ్బంది కలగకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతను అప్పగించింది. ఫిబ్రవరి 20న జీఓ విడుదల చేసిన రాష్ట్రప్రభుత్వం తాజాగా ఫిబ్రవరి 27న స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖకు మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రభుత్వమిచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగానే తమ సాఫ్ట్‌వేర్ సీసీఏ (కార్డ్ సెంట్రలైజ్డ్ ఆర్కిటెక్చర్)లో నూతన మాడ్యుల్స్‌ను చేర్చింది. ఆ సాఫ్ట్‌వేర్‌లో లింక్ డాక్యుమెంట్ నంబర్, ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసిడింగ్స్ నంబర్ ఎంట్రీ చేస్తేనే డాక్యుమెంట్‌లో డాటా ముందుకు వెళ్లేలా తయారు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యంత్రాంగం అంతా సిద్ధం చేసి ఉంచారు. జిల్లా వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 97,492 ఉన్నాయి. మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఎల్‌ఆర్‌ఎస్ 25శాతం రాయితీతో ఒకటి, నవాబ్‌పేట మండలం ఎన్మనగండ్ల గ్రామ పంచాయతికి చెందిన ప్లాటు దస్తావేజును అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు.

నూతన మాడ్యుల్స్‌ను చేర్చాం

జిల్లాలో ఉన్న అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌లో నూతన మాడ్యుల్స్‌ను చేర్చాం. ఈనెల 27న రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. వచ్చే ప్రతి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించాలని సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించాం. 26 ఆగస్టు 2020కి ముందు 10శాతం ప్లాట్లు అమ్మి, మిగిలిన వాటికి కూడా తాజాగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రజలు సద్వినియోగించుకోవాలి.

– వి.రవీందర్, జిల్లా రిజిస్ట్రార్, మహబూబ్‌నగర్

విద్యానిధికి పోలీస్ శాఖ విరాళం



చెక్కును కలెక్టర్ విజయేందిరకు అందిస్తున్న ఎస్పీ జానకి, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

రూ. 3లక్షల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ విద్యానిధికి జిల్లా పోలీసులు బాసటగా నిలిచా రు. శుక్రవారం ఎస్పీ జానకి, సీనియర్ పోలీసు అధికారులతో కలిసి కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కలెక్టర్ విజయేందిర బోయికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. రానున్న నాలుగేళ్లలో రూ. 10 కోట్లు విద్యా నిధి కోసం నిధులను సేకరిండమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు అప్పయ్య, సీఐలు గాంధీనాయక్, ఇజాజుద్దీన్ పాల్గొన్నారు.

అందరి మన్ననలు పొందిన డీఆర్‌ఓ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రెవెన్యూ శాఖలో సుమారు 30ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పని చేసిన డీఆర్‌ఓ కె.వి.వి.రవికుమార్ అందరి మన్ననలు పొందారని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. పదవీ విరమణ పొందిన ఆయనను శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, రిటైర్డ్ అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డీఓ ఇ.నవీన్, టీజీఓ, టీఎన్‌జీఓ సంఘాల నాయకులు విజయ్‌కుమార్, రాజీవ్‌రెడ్డి, చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: ఉన్నత చదువులతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పోతులమడుగు, కర్వెన, ఎల్కిచర్ల గ్రామాల్లో రూ.32 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పోతులమడుగు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 52 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 20లక్షల స్టడీ మెటీరియల్ అందజేశారన్నరు. విద్యార్థులు 10/10 సాధించి కుటుంబానికి, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, పీఆర్ ఏఈ స్వామి, ఎంపీఓ శ్రీదేవి, ఎంఈఓ ఉషారాణి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, భూత్పూర్ పట్టణాధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, నాయకులు గోవర్ధన్‌గౌడ్, విజయ్‌గౌడ్, మాజీ సర్పంచ్ హర్యానాయక్, మాజీ ఎంపీటీసీ ఊషన్న, మాజీసర్పంచ్ కొండయ్య, కిష్టయ్య, బాలవర్ధన్‌రెడ్డి, మన్యం ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామీణాభివృద్ధి సాధ్యం

దేవరకద్ర రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాయపల్లిలో సీసీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను ఇప్పుడు చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో జరిగిన మైలారం మల్లన్న ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అంజిల్‌రెడ్డి, స్వర్ణమ్మ, లక్ష్మీకాంత్‌రెడ్డి, భారతమ్మ, రంగయ్య, రాజశేఖర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలిపి వేయించండి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్
- వాడీవేడిగా మున్సిపల్ బడ్జెట్ సమావేశం
- జడ్చర్ల, కావేరమ్మపేటలను కలిపి ప్రత్యేక మున్సిపాలిటీ చేయాలంటూ వినతి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని కౌన్సిలర్లు నందకిశోర్‌గౌడ్, రఘురాంగౌడ్, సతీష్‌తో పాటు మరికొందరు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో అక్రమ, అనుమతిలేని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలు ఆపివేయించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అధికారులకు ఆదేశించారు. జడ్చర్ల మున్సిపాలిటీ సమావేశ మందిరంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం వాడీవేడిగా ముగిసింది. కమిషనర్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన, చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత సారథ్యంలో జరిగిన సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7380లక్షల బడ్జెట్‌ను ప్రవేశ్టెగా అనేక వాగ్వాదాల అనంతరం దానిని ఆమోదించారు. బడ్జెట్ సమావేశంతోపాటు కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని భావించినా కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకించారు. దీంతో బడ్జెట్ సమావేశాన్ని మాత్రమే జరిపారు. ముఖ్యంగా 4వ వార్డులో 3వేల గజాల స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరినా పట్టించుకోవడం లేదని కమిషనర్‌పై ఫిర్యాదు చేశారు. టీపీఓ(టౌన్ ప్లానింగ్ ఆఫీసర్) మేఘన తాము ఫోన్‌చేసినా, నేరుగా ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని పలువురు కౌన్సిలర్లు సభా దృష్టికి తీసుకొచ్చారు. ఇష్టమొచ్చినట్లు అనుమతులు జారీ చేస్తున్నారని, కార్యాలయంలో అందుబాటులో ఉండరని ఆయనకు వివరించారు. ప్రజలకు, కౌన్సిలర్లకు జవాబుదారీగా ఉండాలని టీపీఓను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఇన్‌చార్జి బాధ్యతలు సక్రమంగా పోషించాలని ఆమెకు సూచించారు. జడ్చర్ల, కావేరమ్మపేట, బాదేపల్లిలోని చాలా ప్రాంతాల్లోని ఇళ్ల రివిజన్‌కు నోచుకోవటం లేదని, తద్వారా పేర్లు మార్పు కావటం లేదని కౌన్సిలర్లు ఆలూరి శశికిరణ్, బుక్క మహేష్, రమేష్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం సర్వే జరుగుతున్నందున కొన్ని నెలల్లోనే సమస్యలు తీరుతాయని ఆయన వివరించారు.

బడ్జెట్ ఆమోదం

2025–26కు సంబంధించిన మున్సిపల్ ఆదాయం రూ.7350.80 లక్షలుగా, ఖర్చులు రూ.7350.45లక్షలుగా సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. మున్సిపాలిటీలో ఆదాయ వనరులు పెంచుకోవాల్సిన అవసరం ఉందని కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకువచ్చారు.

ప్రత్యేక మున్సిపాలిటీ చేయాలంటూ

జడ్చర్ల, కావేరమ్మపేటలను కలిపి ప్రత్యేక మున్సిపాలిటీ చేయాలని రెండు గ్రామాల్లోని 9మంది వార్డు కౌన్సిలర్లందరూ సంతకం చేసి అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుత మున్సిపాలిటీలో ముడా, టీయూఎఫ్ఐడీసీ నిధుల్లోనూ తమకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. తమవద్ద వనరులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. వైస్‌చైర్‌పర్సన్ పాలాది సారిక, వార్డు కౌన్సిలర్లు లత, శశికిరణ్, బుక్కమహేష్, విజయ్, చైతన్యచౌహన్ ఉన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం

జడ్చర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మధ్యాహ్న భోజనం చేశారు. శుక్రవారం పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఆయనతో పాటు ఎంఈఓ మంజులాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న మున్సిపాలిటీ భవనాన్ని పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేసి కార్యాలయం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ లక్ష్మారెడ్డికి సూచించారు.

యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ

జడ్చర్ల టౌన్: టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో యూపీఎస్‌పై నిర్వహించనున్న యుద్ధభేరి పోస్టర్‌ను మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా బాధ్యులు భార్గవ్, రాంమోహన్ రావ్, జయశంకర్, మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే సీపీఎస్ ఉద్యోగుల యుద్ధభేరికి అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

అఖండ హరినామ సంకీర్తన

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్ గ్రామ వరదరాజస్వామి భజన మండలి తిరుమల తిరుపతి దేవస్థానంలో అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అఖండ హరినామ సంకీర్తన భజనలో పాల్గొనడంతో ఎంతో పుణ్యఫలం దొరుకుతుందన్నారు.

1962 అంబులెన్స్ తనిఖీ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో ఉన్న 1962 అంబులెన్స్‌ను శుక్రవారం 1962ప్రాజెక్ట్ స్టేట్ హెడ్ డా.బగీశ్ మిశ్రా ఆకస్మిక తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని వివిధ పరికరాలు, వాటి పనితీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్ వచ్చిన వెంటనే సిబ్బంది తక్షణమే స్పందించి రైతులకు సేవలు అందించాలన్నారు. ప్రోగ్రాం మేనేజర్ రవి, ఎగ్జిక్యూటివ్ ఉదయ్ కుమార్, డా. వీదిభూషణ్‌రెడ్డి, పరావేట్ సంధ్య, హెల్పర్ నితిన్, కెప్టెన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో కుంకుమార్చన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం మోతీనగర్‌లోని శ్రీకాశీ విశ్వనాథ అన్నపూర్ణ సమేత దేవాలయంలో శుక్రవారం సందర్భంగా కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం దేవాలయంలో అన్నపూర్ణదేవికి కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, చైర్మన్ ఎస్.ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో రుక్మిణి, అండాలు, అరుణ, అఖిలరాణి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి స్థానిక కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని విజ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మ వారి గుడి చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నాగరాజుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయరంగంలో జంతువులు కీలకం

జడ్చర్ల టౌన్: సుస్థిర భవిష్యత్ కోసం వ్యవసాయ రంగంలో మొక్కలు, జంతువులు కీలకమని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య అన్నారు. శుక్రవారం కళాశాల సమావేశ మందిరంలో వృక్ష, జంతు శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో సుస్థిర భవిష్యత్‌కై వ్యవసాయ రంగంలో మొక్కలు, జంతువుల పాత్ర అన్న అంశంపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. జడ్చర్ల భూసార పరీక్ష కేంద్రం ఏడీ ప్రత్యూష మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయమే ముఖ్యమన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం

- ఏడీఈ చంద్రశేఖర్



తాటికొండలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఈ చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్..

భూత్పూర్: విద్యుత్ సమస్య ఉంటే రైతులు స్థానిక ఏఈ దృష్టికి తీసుకురావాలని, వీలుకాని పక్షంలో తనకు ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తానని ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం 'సాక్షి'లో 'తాటికొండలో విద్యుత్ సమస్య' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జడ్చర్ల డివిజన్ విద్యుత్ శాఖ ఏడీఈ చంద్రశేఖర్, స్థానిక ఏఈ మెథుశాలతో కలిసి తాటికొండ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో విద్యుత్ సమస్యపై రైతులతో కలిసి మాట్లాడారు. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో నలుగురు రైతులు ఉన్నారని, మరో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో 13 మంది రైతులు మాత్రమే ఉన్నారని, గ్రామంలో వోల్టేజీ లేకుండా 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరలో బిగించనున్నట్లు ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కి మరమ్మతులు చేపట్టరాదని, విద్యుత్ సిబ్బందికి సమాచారమిస్తే మరమ్మతులు చేస్తామన్నారు. గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైన, స్థల సమస్యతో సబ్‌స్టేషన్ ఏర్పాటులో ఆలస్యమవుతుందని, గ్రామపెద్దలు స్థలం ఇవ్వడానికి ముందుకొస్తే సబ్‌స్టేషన్ పనులు చేపడుతామని ఏడీఈ తెలిపారు.

అవగాహనతో హెచ్‌ఐవీని నివారించొచ్చు

మహమ్మదాబాద్: అవగాహనతో హెచ్ఐవీని నివారించొచ్చని వైఆర్‌జీకే సంస్థ సూపర్‌వైజర్ రాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఐవీ సోకిన వ్యక్తులు ఏఆర్‌టీ మందుల ద్వారా సురక్షితమైన జీవితం ఇవ్వచ్చని అన్నారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, రాములమ్మ పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

నవాబుపేట: పౌరహక్కులపై మరింత అవగాహన అవసరమని ఎస్‌ఐ విక్రమ్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొల్లూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరుల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉందన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్ గ్రామంలో శివాంజనేయ స్వామి దేవాలయ ఉత్సవాలు ముగిశాయి. మూడు రోజుల పాటు చేపట్టిన కార్యక్రమాలతో పాటు శుక్రవారం చేపట్టిన శకటోత్సవం ఆకట్టుకుంది. అనంతరం ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి ఉత్సవాలను ముగించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, రవికిరణ్, ప్రకాష్, బాలచంద్రుడు, శ్రీనివాస్, భాస్కర్ ఉన్నారు.

యువత సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలి

- నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కోట నాయక్



జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కోట నాయక్

మహబూబ్‌నగర్ క్రీడలు: యువత క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కోటనాయక్ అన్నారు. ఎదిర రెవెన్యూ వార్డులో శుక్రవారం నెహ్రూ యువ కేంద్రం సహకారంతో జనరంజని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువత గ్రామాభివృద్ధి, దేశాభివృద్ధికి పాటుపడాలని కొనియాడారు. గ్రామీణ యువత కోసం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. జనరంజని కల్చరల్ అసోసియేషన్ డైరెక్టర్ రవిశంకర్, మాజీ కౌన్సి లర్లు యాదమ్మ హనుమంతు, రవిశంకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాములు, నర్సింలుఏ, ఎల్లయ్య, కోట్ల వెంకటయ్యగౌడ్, సత్యం, శ్రీశైలం, అశోక్‌గౌడ్, అంబదాస్, రాఘవేందర్‌గౌడ్, బి.రాములు, శ్రీనివాసులు, నరేష్, ఆంజనేయులు, విజయ్, నరేష్, పెద్ద కృష్ణ, కర్నె కృష్ణ, కాశన్న పాల్గొన్నారు.

సైన్స్ పై అవగాహన కలిగించాలి

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



మహబూబ్‌నగర్ వాగ్దేవి కళాశాలలో సన్మానం పొందిన అధ్యాపకులు

సాక్షి నెట్‌వర్క్: విద్యార్థులు నిత్య జీవితంలో సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. మహబూబ్‌నగర్ మండలంలోని గాజులపేట గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. మహబూబ్‌నగర్ శ్రీచైతన్య స్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించగా ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ హాజరై ప్రారంభించారు. వాగ్దేవి జూనియర్ కళాశాలలో సైన్స్ అధ్యాపకులను సన్మానించారు. జేపీఎన్‌సీ కళాశాలలో, రెయిన్‌బో, తక్షశిల, గండేడ్ మండలంలోని చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు పలు సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. జడ్చర్ల మండలం గంగాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంఈఓ మంజులాదేవి విజ్ఞాన మేళాను ప్రారంభించారు. రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ సుధాకర్ పాల్గొన్నారు. చిన్నచింతకుంట మండలం లాల్‌కోట, కొకుంట్ల మండలం అప్పంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు పెట్టారు. కోయిల్‌కొండ మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి వెంకటాజీ పాల్గొని మాట్లాడారు.